డీఎంహెచ్‌వోగా భాస్కరరావు



పార్వతీపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో)గా ఎస్.భాస్కరరావు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన విజయ నగరం డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్నారు. బదిలీపై ఇక్కడకు వస్తున్న భాస్కరరావు గతంలో ఈ ప్రాంతంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేశారు. కాగా ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విజయపార్వతి విధులు నిర్వర్తిస్తున్నారు. ఏదేమైనా జిల్లాకు పూర్తిస్థాయి డీఎంహెచ్‌వో నియమించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిరస్త్రాణం.. శ్రేయస్కరం



- హెల్మెట్ వినియోగం తప్పనిసరి
- లేకపోతే చర్యలు తప్పవు
- నిర్లక్ష్యంతో పెరుగుతున్న ప్రమాదాలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- కోర్టు ఆదేశాలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- అవగాహన కల్పిస్తున్న పోలీస్, రవాణా శాఖ

బెలగాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యం భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడం లేదు. చిన్నపాటి నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఎక్కువగా యువత హెల్మెట్ ధరించకుండా బైక్‌లపై వేగంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నారు. రోజురోజుకూ ఇటువంటి రోడ్డు ప్రమాదాలు పెరిగిపోవడంతో హెల్మెట్ వినియోగాన్ని హైకోర్టు తప్పనిసరి చేసింది. శిరస్త్రాణం పెట్టుకోకుంటే ఉపేక్షించొద్దని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్లలో విద్యార్థులు, వాహనదారులకు హెల్మెట్ వాడకంపై రవాణా, పోలీస్ శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ద్విచక్ర వాహన ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా యువత హెల్మెట్ పెట్టుకోవడానికి నామోషీగా ఫీలవుతున్నారు. రోజూ హెల్మెట్ వాడితే తల వెంట్రుకలు రాలిపోతాయని, తల వేడికి గురవుతుందని శిరస్త్రాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో ప్రమాదాలకు గురై తమ నిండు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ ఘటనల్లో కొంతమంది అక్కడికక్కడే మృతి చెందుతున్నారు. మరెందరో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రులకు చేరుతున్నారు. అయినా చాలామంది హెల్మెట్ పెట్టుకోవాలన్న నిబంధన మాత్రం ఎవరూ పాటించడం లేదు. ప్రమాదాలు సంభవించినప్పుడు శిరస్త్రాణం ఉంటే ఏమీ జరగకుండా ఉండేదని అనుకుంటున్నారు తప్ప హెల్మెట్‌ను మాత్రం పెట్టుకోవడం లేదు. జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదని మరోవైపు వాహన తయారీదారులు, రవాణా శాఖ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. అయితే గమ్యానికి త్వరగా చేరుకోవాలనే ధ్యాసతో కొందరు, మరికొందరు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల వారితో పాటు ఎదుటి వారిని కూడా ప్రమాదంలోకి నెడుతున్నారు. శిరస్త్రాణం లేక జూన్ నుంచి ఇప్పటివరకు 16 మంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వాస్తవంగా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తలకి దెబ్బ తగిలితే మెదడు కణాలుగా పిలిచే న్యూరాన్లు నశిస్తాయి. దీనివల్ల అవయవాలు శాశ్వతంగా చచ్చుబడిపోతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే తలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, హెల్మెట్ ధరిస్తే ప్రాణాలను రక్షించుకునే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు.

- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్‌లు చెబుతున్నాయి. దీని ప్రకారం ఎవరైనా హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధించే అవకాశాలున్నాయి. పదేపదే వాహనదారుడు హెల్మెట్ లేకుండా జరిమానా పడుతుంటే డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేసే అవకాశం ఉంది.

నాణ్యమైనవి వాడాలి..

నాసిరకం హెల్మెట్‌ను ధరిస్తే ప్రమాద తీవ్రతను ఏమాత్రం తగ్గించలేవు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకుని హెల్మెట్ కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలి. హెల్మెట్ స్ట్రాప్ గెడ్డంపై ఉంచేందుకు అనువుగా ఉండేలా

(మిగతా 8వ పేజీలో...)

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	మరణాలు
2022	77
2023	95
2024 (డిసెంబరు18)	68

చలానాల వివరాలు

సంవత్సరం	చలానాలు
2022	33,742
2023	78,678
2024	84,550



రాష్ట్ర కమిటీలో మంత్రి సంధ్యారాణికి స్థానం



పార్వతీపురం, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ పథకానికి సంబంధించి మంత్రుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈమేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి చోటు దక్కింది. మరో కమిటీ సభ్యురాలిగా హోంశాఖ మంత్రి అనితను నియ మించారు. రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సారథ్యంలో ఈ కమిటీ పనిచేయనుంది.

తేరుకునేది ఎలా?

- ఎడతెరిపిలేని వర్షాలతో నష్టం
- నీటిలోనే వరి, పత్తి, మొక్కజొన్న
- కుదేలైన రైతులు

6లో



వదలని గజరాజులు

- పంటలు ధ్వంసం ● లబోదిబోమంటున్న రైతులు

గరుగుబిల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలాన్ని గజరాజులు వదలడం లేదు. గత రెండు రోజులుగా సుంకి పంచాయతీ పరిధిలో సంచరిస్తూ వరి కుప్పలు, ధాన్యం నిల్వలతో పాటు కూరగాయల పంటలను ధ్వంసం చేశాయి. శనివారం కూడా ఆ గ్రామంలో వరి కుప్పలను తొక్కి పనికి రాని విధంగా చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒకవైపు వర్షం, మరోవైపు ఏనుగుల సంచారంతో తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి నష్టపరిహారం అందించాలని వారు కోరుతున్నారు. ఏనుగుల గుంపును వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.



సుంకి గ్రామ సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

విద్యుదాఘాతంతో అన్నదమ్ముల మృతి

- ఎస్టీ మరువాడ వద్ద ఘటన
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

జియ్యమ్మవలస, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోజులాగానే పొలానికి వెళ్లిన అన్నదమ్ములు తిరిగి ఇళ్లకు చేరుకోలేదు. విద్యుదాఘాతానికి గురై తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషాదకర ఘటన జియ్యమ్మవలస మండలం అలమండ పంచాయతీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శిఖబడి గ్రామానికి చెందిన వైకుంఠం శ్రీనివాసరావు (48), సింహాచలం (45) అన్నదమ్ములు. వారికి ఎస్టీ మరువాడ సమీపంలో పొలాలు ఉన్నాయి. అయితే రోజులాగానే శనివారం ఉదయం శ్రీనివాసరావు పొలానికి వెళ్లాడు. రెండో పంటగా వేసుకున్న ఆకు బట్టీలకు నీరు మళ్లించాలనుకున్నాడు. ఈ మేరకు సమీపంలో ఉన్న మోటార్ వద్దకు వెళ్లాడు. అక్కడున్న విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టింగ్ వైరును పట్టుకొని కిందికి దిగే ప్రయత్నం చేశాడు. ఈ లోగా షార్ట్ సర్క్యూట్ జరడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపటికీ సోదరుడు రాకపోవడంతో మధ్యాహ్నం సింహాచలం పొలానికి వెళ్లాడు. సోదరుడు అలా ఎందుకు పడి ఉన్నాడో తెలియక విద్యుత్ స్తంభం సపోర్టింగ్ వైరు పట్టుకోవడంతో సింహాచలం కూడా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అయితే పొలాలకు వెళ్లిన వారు సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కలత చెందారు. పక్కింట్లో ఉన్న యర్రా సురేష్‌నాయుడుకు విషయం చెప్పారు. ఆయన పొలానికి వెళ్లి చూడగా.. విగత జీవులుగా పడి అన్నదమ్ములను చూసి కేకలు వేస్తూ.. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్నదమ్ముల మృతదేహాలను చూసి భోరున విలపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పకీరు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా మృతి చెందిన వైకుంఠం శ్రీనివాసరావుకు భార్య , ఇద్దరు కుమారులు ఉన్నారు. సింహాచలానికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా మృతుల మరో సోదరుడు కృష్ణ కూడా నాలుగేళ్ల కిందట అలమండ సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మొత్తంగా ముగ్గురు అన్నదమ్ములు విద్యుదాఘాతంలో మృతి చెందడాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ విషాదకర ఘటనతో శిఖబడి గ్రామం శోక సంద్రంలో మునిగిపోయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జియ్యమ్మవలస ఎస్ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



శ్రీనివాసరావు, సింహాచలం(ఫైల్)

మా చదువులు సాగట్లే..

- ఉపాధ్యాయుల కోసం రోడ్డెక్కిన గిరిజన విద్యార్థులు
- ఐటీడీఏ ఎదుట నినాదాలు

సీతంపేట రూరల్, డిసెంబరు 21: గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక తమ చదువులు ముందుకు సాగడం లేదని, సిలబస్ పూర్తవ్వడం లేదని గిరిజన విద్యార్థులు రోడ్డెక్కారు. మల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్న 54 మంది గిరిజన విద్యార్థులు శనివారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయానికి చేరుకుని నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ పాఠశాలలకు ఉపాధ్యాయులు కావాలని అడవితల్లి విగ్రహం వద్ద నినదించారు. అనంతరం డీడీ కార్యాలయం ఎదుట కూడా నిరసన తెలిపారు. దీంతో ఏఎంవో కోటిబాబు, సూపరింటెండెంట్ దేశ్‌లు విద్యార్థుల వద్దకు వెళ్లి వారికి సర్దిచెప్పారు. ఇదిలా ఉండగా గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేపట్టిన దీక్ష శనివారం 32వ రోజుకు చేరింది. సీఆర్‌టీలతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధ్యాయులు బి.గణేష్, మోహనరావు, భవానీ,భాగ్యలక్ష్మిలు డిమాండ్ చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు

రక్తహీనత కేసులు తగ్గాలి: కలెక్టర్

పార్వతీపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతినెలా రక్తహీనత (ఎనీమియా) కేసుల్లో తగ్గుదల కనిపించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఎనీమియా నివారణకు పెద్ద ఎత్తున పోషకాహారం, మందులు పంపిణీ చేస్తున్నా.. పరిస్థితి అదుపులోకి రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇకపై వైద్యాధికారులు రక్తహీతన కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, కేసుల తగ్గు దలపై నివేదిక అందించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. సక్రమంగా విధులు నిర్వర్తించకుంటే సంబంధిత వార్డెన్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణ బాధ్యత మహిళా శిశు సంక్షేమశాఖదేనని తెలిపారు. తోణాం, దుద్దుకల్లు పీహెచ్‌సీల పరిధిలో అధికంగా ఎనీమియా కేసులు నమోదవడానికి కారణాలేమిటని ప్రశ్నించారు. ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి వారం రోజుల పాటు అక్కడే బస చేసి పర్య వేక్షించాలని ఆదేశించారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్, ఫీడర్ అంబులెన్స్‌ల వినియోగంపై చర్యలు తీసుకోవాలన్నారు. సికిల్‌సెల్ వ్యాధిగ్రస్థుల కోసం పార్వతీపురం, సాలూరులో ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలన్నారు.

ఆర్టీసీ అభివృద్ధే లక్ష్యం

- రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

పార్వతీపురం/పార్వతీపురం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం పార్వతీపురం ఆర్టీసీ డిపోలో పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోలకు చెందిన కొత్త బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... ఆర్టీసీలో సమర్థవంతంగా పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులకు సర్కారు అండగా ఉంటుందన్నారు. నైట్‌ఔట్ విధులు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్లకు అదనపు వేతనం ఇచ్చే విధంగా ఇప్పటికే ప్రత్యేక జీవో విడుదల చేసినట్లు తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి.. జిల్లాలో ఆర్టీసీ డిపోలను ఏక కాలంలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. త్వరలో ఎలక్ట్రికల్ బస్సు సర్వీసు సేవలను అందుబాటులోకి తేనున్నామని తెలిపారు. వాటిల్లో డ్రైవర్లు, కండక్టర్లను నియమించేందుకు ఇదో మంచి అవకాశమన్నారు. ఆ తర్వాత ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. చిన్న చిన్న తప్పులకు కార్మికులు, ఉద్యోగులకు నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. దీనిపై అధికారులు పునరాలోచించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన పార్వతీపురం మన్యం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు అద్భుత మైన విజన్‌తో పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయచంద్రతో కలిసి బస్సులో జిల్లా కేంద్రమంతా తిరిగారు. తన తండ్రి గతంలో కండక్టర్‌గా పనిచేశారని ఈ నేపథ్యంలో ఆర్టీసీతో విడదీయలేని బంధం ఉందని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ విజయ్‌కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, పార్వతీపురం డీఎం దుర్గా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సీతారామ, వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ● జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అధునాతన క్రీడా ప్రాంగణం నిర్మాణానికి సంబంధించి మంత్రి భూమి పూజ చేశారు. ఇటువంటి క్రీడా ప్రాంగణాల వల్ల ఉత్తమ క్రీడాకారులు తయారు అవుతారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో క్రీడా వికాస కేంద్రం నిధులతో దీన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరీ తదితరులు పాల్గొన్నారు. ● సీతానగరం: మండల కేంద్రం లోని హనుమాన్ కూడలిలో బస్ షెల్టర్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ● పార్వతీపురం రూరల్: నర్సిపురం వద్ద ఆర్టీసీ డ్రైవింగ్ ట్రాక్ పనులకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.



నూతన బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి , ఎమ్మెల్యే తదితరులు

బాబోయ్.. దోమలు!

- వరుస తుఫాన్లతో పారిశుధ్యం అధ్వానం
- కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- ఎక్కడికక్కడే మురుగునీరు
- ఫాగింగ్ ఊసెత్తని పాలకవర్గాలు
- ప్రజారోగ్యంపై ప్రభావం



కొరంగజవీధిలో మురుగుతో నిండిన కాలువ

రాజాం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి)

రాజాం మున్సిపాలిటీ, మండలవ్యాప్తంగా దోమలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉండటమే కారణం. ఫాగింగ్ సైతం చేపట్టకపోవడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది. వరుస తుఫాన్ల నేపథ్యంలో రాజాం మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా పారిశుధ్య పనులు పడకేశాయి. మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇళ్ల నుంచి వాడుకల నీరు సజావుగా బయటకు వెళ్లే ఏర్పాట్లు లేకపోవడంతో ఎక్కడికక్కడే నిలుస్తోంది. పర్యవసానంగా దోమలు పెరుగుతున్నాయి. అయితే వాటి నివారణకు పంచాయతీ పాలకులు చర్యలు చేపట్టడంలేదు.

కొద్దిరోజులుగా దోమలు విజృంభించడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. జ్వరాల బారిన పడిన వారిలే మలేరియా, టైఫాయిడ్ లక్షణాలే ఎక్కువగా కనిపించడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారిలో ఎక్కువ మంది జ్వరాల బారిన పడినవారు ఉంటున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.కరణం హరిబాబు చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం జ్వరపీడితులే అధికంగా కనిపిస్తున్నారు. జ్వరాల బారిన పడిన వారు రక్తపరీక్షలు చేయించుకుంటుండటంతో ప్రైవేట్ ల్యాబ్‌ల వారి పంట పండినట్టయింది. పరీక్షలకు పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. దోమల నివారణ లిక్విడ్స్, కాయిల్స్‌కు ప్రత్యేకంగా వెచ్చించాల్సిన పరిస్థితులు దాపురించాయి.

రాజాం మున్సిపాలిటీ పరిధిలో గత ఆరునెలల కాలంలో ఫాగింగ్ చేసిన దాఖలాల్లేవు. స్లమ్ ఏరియాలలో నిత్యం ఫాగింగ్ చేయించాల్సి ఉన్నా ఆదిశగా మున్సిపల్ అధికారుల చర్యల్లేవు. కాలువల్లో పేరుకుపోతున్న చెత్త మురుగునీటి ద్వారా వర్షాకాలంలో కురిసిన వర్షాలకు శుభ్రం కావడమే తప్ప ప్రత్యేకంగా పరిశుభ్రం చేయించిన పరిస్థితి పట్టణంలో లేదు. పత్రికలలో కథనాలు ప్రచురితమైతే ఆదరాబాదరాగా చెత్త తొలగింపు ప్రక్రియ చేసి మమ అనిపించే పరిస్థితి పట్టణంలో దర్శనమిస్తోంది. ప్రధానంగా చెత్త నిల్వ కేంద్రాల వద్ద పేరుకు పోతున్న చెత్తను నిత్యం తరలించకుండా విడతల వారీగా రెండు మూడురోజులకు ఓసారి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇలా చేయడం వల్ల కూడా దోమల సంతతి పెరిగేందుకు దోహదపడుతోంది.



మల్లికార్జున కాలనీ మొదటివీధి ప్రారంభంలో..



విజ్జీ క్రికెట్ మైదానంలో పిచ్‌ను కవర్లతో కప్పి ఉంచిన దృశ్యం

‘విజయ్ హజారే’కి వర్షంతో బ్రేక్

విజయనగరం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ ప్రారంభోత్సవ మ్యాచులకు వర్షం అడ్డంకిగా మారింది. జిల్లా వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆతిథ్యం ఇస్తున్న విజయ్ హజారే ట్రోఫీ మ్యాచులు శనివారం ప్రారంభం కావలసి ఉంది. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో నగరంలోని విజ్జీ క్రికెట్ మైదానంతో పాటు, చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానం ఆట నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు తొలిరోజు తమిళనాడు- చండీగర్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను రద్దు చేశారు. అలాగే జమ్ము కశ్మీర్ - ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య నిర్వహించాల్సిన మ్యాచ్‌ను కూడా రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

సాలూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ఆరో పాశురం సందర్భంగా స్థానిక కల్యాణ వేంకటేశ్వర స్వామి, పెదకోమటి పేట రామాలయాల్లో శనివారం వైభవంగా పూజలు నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవికి, కల్యాణ వేంకటేశ్వర స్వామికి అష్టోత్తర శతనామార్చనచేశారు. మహిళా భక్తులు అమ్మవారికి పల్లకి సేవను నిర్వహించారు. నారాయణాచార్యులు, ఉదయాచార్యులు చేశారు. రాత్రి కి విష్ణు సహస్ర నామార్చన, పెదకోమటపేట రామాలయంలో పాశుర విన్నపం చేశారు. అర్చకులు నారాయణాచార్యులు, ఉదయాచార్యులు పాల్గొన్నారు.



గోదాదేవికి పల్లకి సేవ చేస్తున్న మహిళా భక్తులు



విశేష అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి



విద్యార్థుల నృత్య ప్రదర్శన



విద్యార్థినుల నృత్య రూపకం

దేశభక్తిని పెంపొందించాలి

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

- రియర్ అడ్మిరల్ శ్రీనివాస్
- ఘనంగా సైనిక పాఠశాల వార్షికోత్సవం

విజయనగరం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ సూచించారు. జిల్లాలోని కోరుకొండ సైనిక పాఠశాల 63వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్, రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి, అధికారులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో ఉన్న అమరవీరుల స్థూపాన్ని ఆయన సందర్శించి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ రక్షణ రంగంలో కోరుకొండ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థులు అనేక మంది వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను ఆ పాఠశాల పూర్వ విద్యార్థినని తెలిపారు. క్రమశిక్షణ, మానసిక వికాసం, దేశభక్తి పెంపొందించుకోవడం, విద్య, క్రీడలు, లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో సైనిక పాఠశాల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదువుతో పాటు, క్రీడలు ఒక భాగమేనని చెప్పారు. అన్ని రంగాల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఎన్‌డీఏలో చేరడమే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి ఈ ఏడాదిలో పాఠశాల అభివృద్ధి, విద్యార్థులు సాధించిన విజయాలను ఆయనకు వివరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు షీల్డ్‌లు, నగదు బహుమతులన అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి

ఆదర్శ పంచాయతీగా నిలుపుదాం

- నీతిఅయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్ కుమార్

భామిని, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మనుమకొండ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు భాగస్వాములు కావాలని నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలోని నీతి అయోగ్ బృందం శనివారం మనుమకొండను సందర్శించింది. థింసా నృత్యంతో వారిని ఆదివాసీ గిరిజనులు ఆహ్వానించారు. గిరిజనులతో సమావేశమై గ్రామంలో ఉన్న మౌలిక వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జీపీఎస్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సబ్ సెంటర్ అవసరమని సర్పంచ్ నిమ్మల కేశవ ఈ బృందం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా వారు స్పందించారు. అనంతరం పాలవలస సబ్ సెంటర్‌ను, బత్తిలి పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దామోదర్‌తో మాట్లాడి.. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నీతి అయోగ్ యంగ్ ప్రొఫెసనల్ ఇంద్రజిత్ కుమార్, మధుసూదనరావు, కో-ఆర్డినేటర్, మహేష్, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, ఏపీఎం చక్రపాణి, ఏపీవో తులసీ దాస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



థింసా నృత్యంతో నీతి అయోగ్ బృందాన్ని ఆహ్వానిస్తున్న దృశ్యం



బొబ్బిలి రూరల్: కారాడలో నీటిలో వరి కుప్పలు

తేరుకునేది ఎలా?

- ఎడతెరిపిలేని వర్షాలతో నష్టం
- నీట మునిగిన వరి
- కొన్నిచోట్ల మొలకలు
- కళ్లాలకు చేర్చినా కాపాడుకోలేని దైన్యం
- కుదేలైన అన్నదాతలు

(ఆంధ్రజ్యోతి బృందం)

పంట బాగుంది.. పండగను సంతోషంగా జరుపుకోవచ్చని ఆశపడిన అన్నదాత ఆశలపై ప్రకృతి నీరుచల్లింది. పంట ఇంటికి చేరుతుందనుకున్న వేళ అల్పపీడనం రూపంలో దాడి చేసింది. ఏకధాటిగా నాలుగు రోజులుగా కురిసిన వర్షాలతో నిండా ముంచేసింది. నిన్నమొన్నటి వరకు పచ్చగా ఉన్న పంటను చూసి మురిసిపోయిన రైతన్న... ఇప్పుడు నీటిలో ఉన్న పంటను చూసి కన్నీరుమున్నీరవుతున్నాడు. పంటను రక్షించుకునే మార్గం లేక.. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తల్లడిల్లుతున్నాడు. కొన్ని చోట్ల పంట పొలాల్లోనే నెలకొరిగింది. మరికొన్ని చోట్ల నీట మునిగింది. ఇంకొన్ని గ్రామాల్లో కోసి..కుప్పలుగా పెడితే.. పూర్తిగా నీటిలో తడిసిపోయాయి. అనేక చోట్ల నూర్పులు పూర్తయినప్పటికీ కళ్లాలోనే ధాన్యం వదిలేశారు. ఆ ధాన్యం కూడా నీట మునిగాయి. చాలా గ్రామాల్లో పొలాల్లోనే మొలకలు వస్తున్నాయి. ఇలా చేతికి అందివచ్చిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు దీనంగా విలపిస్తున్నారు. ఇంకోవైపు రబీ పంటలైన పెసర, మినుము నీట మునిగాయి. వర్షాలతో దెబ్బతిన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కర్షకులు కోరుతున్నారు.



చీపురుపల్లి: నీట మునిగిన వరి కంకులను చూపిస్తున్న రైతులు



సంతకవిటి: మల్లయ్యపేట వద్ద నీటిలో వరిచేను కుప్పలు



పాలకొండ: నీటిలో మొక్కజొన్న పంట



గజపతినగరం: మదుపాడ వద్ద...



భోగాపురం: పొలాల్లో వరిని ఆరబెట్టిన దృశ్యం



సాలూరు రూరల్: దేవుబుచ్చింపేటలో...



గంట్యాడ: రామవరంలో ఇలా...



వీరఘట్టం: కిమ్మిలో నీటిని తొలగిస్తున్న రైతు



డెంకాడ: నీట మునిగిన జొన్న పంట



గరుగుబిల్లి: సుంకి సమీపంలో తడిసిన ఇటుక బట్టీని చూపిస్తున్న నిర్వాహకుడు



పూసపాటిరేగ: నీటిలో ఉన్న టమోటా పంటను పరిశీలిస్తున్న రైతు

సౌకర్యాలు లేక.. గిట్టుబాటు కాక

- శిథిలావస్థకు చేరిన చేపలు ఆరబెట్టే ప్లాట్‌ఫారాలు
- గిడ్డంగులు లేక అవస్థలు
- ఇదీ భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని తీర ప్రాంత మత్స్యకారుల పరిస్థితి


ముక్కాం తీరంలో శిథిలావస్థకు చేరిన ప్లాట్‌ఫారం

భోగాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ తీరప్రాంతంలో మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రధానంగా ప్రభుత్వాలు మారుతున్నా వీరి జీవనం పరిస్థితి మారడం లేదు. తీర ప్రాంతంలో మత్స్యసంపద వేట, వాటిని అమ్మకాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. దీనికితోడు వీరు సేకరించే మత్స్యసంపదకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ధర లభించే సమయంలో విక్రయించేందుకు గడ్డింగులు సైతం నిర్మాణానికి నోచుకోవడంలేదు.

కమ్యూనిటీ భవనాలు లేక..

జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో గల 17 తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులు చేపలవేటపై ఆధారపడి 30 వేల మంది జీవిస్తున్నారు. మత్స్యకారులు వేట సాగించి తీరానికి తీసుకొచ్చిన చేపలు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. చేపలు నిల్వ చేసుకోవడానికి సౌకర్యం లేక పోవడంతో తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తోంది. సముద్రంలో సేకరించిన మత్స్య సంపదను ఆరబెట్టి విక్రయించేందుకు ప్లాట్‌ఫారాలు, శీతల గిడ్డంగులు వంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు. ఈ ఏడాది మత్స్యకార భరోసా కూడా ఇప్పటివరకూ ఇవ్వలేదని చెబుతు న్నారు. వలలు దాచు కునేందుకు భవనాలు సైతం తీరం లేవు. గతంలో కొండరాజుపాలెంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. వేటాడిన తర్వాత తీరంలో సేదదీరడానికి కమ్యూనిటీ భవనాలు సైతం నిర్మించలేదని మత్స్యకారులు వాపోతున్నారు. సముద్రం లో దొరికే చిన్న చేపలు తక్కువ ధర పలుకు తాయని, వాటిని ఆరబెట్టి అమ్మకాలు జరిపితే ధర కాస్త అధికంగా వస్తుందని మహిళలు చెబుతు న్నారు. అయితే చేపలు ఆరవేసుకోవడానికి తీరంలో నిర్మించిన ప్లాట్‌పారాలు శిథిలావస్థకు చేరాయి. పలు గ్రామాల్లో ప్లాట్‌పారాలు లేకపోవడంతో తీరంలో వలలు వేసి చేపలు ఆరవేసుకోవలసి వస్తోందని, దీంతో ఎండిన చేపలకు ఇసుక అతుక్కొని ధర తక్కువగా లభిస్తోందని వాపోతున్నారు.

ప్లాట్‌ఫారాలు నిర్మించాలి..



తీరంలో చిన్నచిన్న చేపలు కొనుక్కొని వాటిని ఉప్పునీటిలో నిల్వఉంచి ఆరవేసి అమ్మకాలు జరుపుతుంటాం. అయితే ప్లాట్ పారాలు లేక ఆరవేస్తున్న చేపలకు ఇసుక అతుక్కోవడంతో తక్కువ ధర పలుకుతోంది. చేపలు ఆరవేసుకోవడానికి అనుకూలంగా ఉండే విధంగా ప్లాట్‌పారాలు నిర్మించాలి.

-అమర ఎర్రమ్మ, చేపల వ్యాపారి, ముక్కాం

పాతపట్నం ఎమ్మెల్యే తనయుడి వాహనం ఢీకొని .. లివిరికి చెందిన ఐదుగురికి తీవ్ర గాయాలు

పాతపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు తనయుడి వాహనం అదే మండలంలోని కొరసవాడ సమీపంలో ఆటోని ఢీకొన్న ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని లివిరికి చెందిన ఐదుగురికి శనివారం తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళ్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్ తనయుడు సాయిగణేష్ వాహనం కొరసవాడ సమీపంలో పాతపట్నం నుంచి సీది వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. ఆటో నుజ్జు నుజ్జుకావడంతో అందులో ప్రయాణిస్తున్న భామిని మండలంలోని లివిరిలోని ఒకే కుటుంబానికి చెందిన సవలాపురం నరేష్, గణేష్, చొప్ప జోగయ్య, చొప్ప సంతు(మహిళ)తోపాటు ఆటో డ్రైవర్ కూర్మాన నవీల్ పురింజకు తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా పాతపట్నం శివశంకర్ కాలనీలో సమీప బంధువు మృతి చెందిన నేపథ్యంలో పరామర్శకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా ఆ వాహనంలో క్షతగాత్రులను పాతపట్నం సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్సచేశారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనలో వాహనంలోని బెలూన్ ఓపెన్ కావడంతో ఎమ్మెల్యే తనయుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వాహనం డ్రైవర్ పల్లి రాజుపై కేసునమోదు చేసినట్లు సీఐ వి.రామారావు తెలిపారు.

వర్షాలకు కూలిన మిద్దె ఇల్లు గోడ

దత్తిరాజేరు, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడసాం గ్రామానికి చెందిన పల్లికల అప్పన్న, గౌరీ దంపతులకు చెందిన మిద్దె ఇల్లు గోడ కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండలఉపాధ్యక్షుడు మజ్జి మహేష్, టీడీపీ, జనసేన నాయకులు పరామర్శించారు. ఈ విషయంపై వీఆర్వో, తహసీల్దార్‌కు తెలియజేశారు.

నీలమ్మ చెరువులో ఆక్రమణల తొలగింపు

మెంటాడ, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి): కొండలాంగాలవలసలోని నీలమ్మ చెరువులో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. శనివారం కొండలాంగాలవలసలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామంలోని నీలమ్మచెరువు ఆక్రమణకు గురయ్యిందని గ్రామస్థుల ఫిర్యాదుమేరకు తహసీల్దార్ శ్రీనివాసరావు సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో చెరువును సర్వే చేయించారు. సర్వేనెంబరు 290లో 42.06 ఎకరాల విస్తీర్ణంలో నీలమ్మ ప్రభుత్వ చెరువు ఉండేదని, ప్రస్తుతం 20 ఎకరాల వరకు ఆక్రమణకు గురైనట్లు గుర్తించినట్లు తహసీల్దార్ చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వ స్థలం ఆక్రమించినవారు శిక్షార్హులని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే ఆక్రమణదారులపై కేసులు నమోదుచేసి చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఆంధ్రా క్రికెట్ జట్టులో హారిక



విజయనగరంటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రా క్రికెట్ రాష్ట్ర మహిళల వన్డే జట్టులో విజయనగరం క్రీడాకారిణి కోరుకొండ హారికకు స్థానం లభించింది. అండర్-19 విభాగంలో ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఇటీవల ప్రకటించిన 16 మంది సభ్యుల్లో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న హారికకు చోటు లభించింది. వచ్చే నెల నాలుగు నుంచి కేరళలో జరిగే వన్డే టోర్నీలో ఆమె పాల్గొంటారు.ఈ మేరకు హారికను అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

కోర్టు భవనాలకు నిధులు విడుదల చేయించాలి


లలితకుమారికి వినతి పత్రం ఇస్తున్న డీవీఎల్ దేవి

కొత్తవలస, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి: కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాల నిర్మాణానికి మంజూరుచేసిన 4 కోట్ల 68 లక్షల రూపాయలు త్వరగా ప్రభుత్వం నుంచి విడుదలయ్యే విధంగా కృషిచేయాలని స్థానిక న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, మాజీ అధ్యక్షులు డీఎస్‌రాజు, గొడుగుల మహేంద్ర కోరారు. ఈ మేరకు శనివారం ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. కొత్తభవనాలకు నిధుల విడుదలపై న్యాయ, ఆర్థికశాఖ మంత్రులు ఫరూఖ్, పయ్యావులకేశవ్ దృష్టికి తీసుకెళ్లి సీఎం చంద్రబాబుతో మాట్లాడుతానని లలితకుమారి హామీఇచ్చారు.

పెట్రోల్ కల్తీపై వాహనచోదకుల నిరసన

డెంకాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డెంకాడలోని ఓ పెట్రోల్ బంక్‌లో విక్రయిస్తున్న డీజిల్, పెట్రోల్‌లో కల్తీ జరిగిందని శనివారం సాయంత్రం వాహనచోదకులు పెట్రోల్ బంక్ వద్ద నిరసనకు దిగారు. బాధితుల కథనం మేరకు.. పలాసకు చెందిన వేణుగోపాల్ శనివారం ఉదయం విజయనగరం నుంచి పలాస వెళ్తున్నాడు.మార్గమధ్యలో గల డెంకాడలోని పెట్రోల్ బంక్‌లో సుమారు రూ.వెయ్యి డీజిల్‌ను కారులో వేయించాడు. బంక్ నుంచి నాతవలస వెళ్లే సరికి కారుఆగిపోవడంతో దగ్గరలో గల కారుషోరూముకు సమాచారం తెలియజేసి మెకానిక్‌ను తీసుకువచ్చాడు. షోరూములో మెకానిక్‌లు పరిశీలించి, డీజిల్‌లో కల్తీజరగడంతో ఇంజన్ పాడైపోయిందని వేణుగోపాల్‌కు తెలియజేశారు. అలాగే డెంకాడకు చెందిన మురళి తన బస్సులో 208 లీటర్ల డీజిల్ వేయించగాకొంతదూరం వెళ్లే సరికి ఆగిపోవడంతో మెకానిక్‌ను తీసుకువచ్చి తనిఖీచేయించాడు. డీజిల్ కల్తీ వల్ల ఇంజన్ పాడయ్యిందని గుర్తించారు. దీంతో వెంటనే పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని బంక్ యజమాని, ఉద్యోగులతో వాగ్వాదానికి దిగారు. వారితో పాటు కొందరు చేరుకుని నిరసన తెలిపారు. డెంకాడ ఎస్ఐకు సమాచారం తెలియడంతో పోలీసులు వచ్చి పెట్రోల్, డీజిల్ విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.


బంక్ వద్ద నిరసన తెలుపుతున్న వాహనచోదకులు

జిల్లా వైద్యాధికారిగా జీవనరాణి



విజయనగరం రింగు రోడ్డు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యాధికారిగా జీవనరాణి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా వైద్యాధికారి భాస్కరరావును పార్వతీపురం మన్యానికి జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్వర్వులు ఇచ్చారు.

డీసీఎంఎస్ పరన్స్ ఇన్‌చార్జి పదవీ కాలం పొడిగింపు

విజయనగరం,కలెక్టరేట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):. డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి గడువు మరో ఆరునెలలు పాటు పొడిగిస్తే ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు ఈనెల 27 నుంచి వచ్చే ఏడాది జనవరి 25 వరకూ గడువు పెంచింది. డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ వ్యవహరిస్తున్నారు.

నేడు మంగళపాలెంలో క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభం

కొత్తవలస, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగళపాలెంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్(యూఎస్‌పి) వారు అందించిన రూ.15 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల క్యాన్సర్ ఆసుపత్రిని ఆదివారం ప్రారంభించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. కార్యక్రమానికి సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి, విశాఖ, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు,ఎమ్మెల్యేలు పీవీజీఆర్‌నాయుడు, కోళ్ల లలితకుమారి హాజరవుతున్నట్టు గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్ బాబు తెలిపారు. ఈ క్యాన్సర్ ఆసుపత్రి వల్ల ఉత్తరాంధ్ర వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ సంస్థ వ్యవస్థాపకుడు ఉప్పలపాటి వెంకటపతిరాజు, జగదీష్‌బాబు తెలిపారు. అలమండ ప్రాంతానికి చెందిన ఉప్పలపాటి వెంకటపతిరాజు నాలుగు దశాబ్దాల కిందట అమెరికా వెళ్లి స్థిరపడి ఈ ప్రాంత ప్రజలపై ఉన్న మమకారంతో గురుదేవ చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలపై నమ్మకంతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి సాయం అందించారని జగదీష్‌బాబు చెప్పారు. ఇక్కడ పేద క్యాన్సర్ రోగులకు ఉచితంగా చికిత్సలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 42 మంది ఎంపిక

చీపురుపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 42 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్ పీవీ కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో తమ కళాశాలకు చెందిన 14 మంది ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వడిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జి సెంటరు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ సంయుక్తంగా నిర్వహించిన మేళాలో దివీస్‌లేబరేటరీ లిమిటెడ్ సంస్థ ప్రతి నిధులు, జేకేసీ సమన్వయకర్త కె.ఉషాజ్యోతి, మెంటార్ అమర్‌లింగం పాల్గొన్నారు.

48 మందికి కళ్ల జోళ్లు

లక్కవరపుకోట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లిలో ఇటీవల జరిగిన నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేసిన 48 మందికి కళ్లజోళ్లు మంజూరైనట్లు విశ్వ మందా ఫౌండేషన్ ఛైర్మన్ ఎం.అమ్మాజీ తెలిపారు. ఏడుగురు కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారని చెప్పారువీరందరికి ఉచితంగా ఫౌండేషన్ నుంచి అందిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి డిబేట్‌కు గీతశ్రీ ఎంపిక

లక్కవరపుకోట,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకులపాఠశాల పదోతరగతి విద్యార్థిని గీతశ్రీ రాష్ట్రస్థాయి డిబేట్ పోటీలకు ఎంపికయ్యింది. వినియోగదారుల వారోత్సవాలు పురస్కరించుకుని నిర్వహించిన డిబేట్‌లో గీతశ్రీ ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ యువీకే పాత్రో తెలిపారు.

బెల్ట్‌షాపుపై దాడులు

గజపతినగరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గజపతినగరంలోని ఆంధ్రప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై ఎక్సైజ్ సీఐ జనార్దనరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల నడుమ బెల్ట్ దుకాణం శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలోప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.ఈ సందర్భంగా షాపు మూసివేయడంతో సిబ్బంది చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రులు పెట్టుబడులతో రావాలి

- ఎన్నారైలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ఆన్‌లైన్ వేదికగా ప్రవాసాంధ్రులతో మంత్రి శ్రీనివాసరావు

విజయనగరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాతృభూమి అభివృద్ధికి, వివిధ దేశాల్లో ఉన్న తెలుగు ప్రజలు ఆయా దేశాల నుంచి పెట్టుబడులు వచ్చేందుకు సహకరించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు కోరారు. ప్రవాసాంధ్రుల తెలుగు సంఘం ఆధ్వర్యంలో యూరప్‌లోని 11 దేశాల్లో నివసించే ప్రవాసాంధ్రులతో ఆన్‌లైన్ వేదికగా శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులతో మాట్లాడుతూ ప్రవాసీయులతో సంబంధాలు మెరుగుపరిచేందుకే మంత్రిత్వశాఖ ప్రత్యేకంగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అన్నిదేశాల తెలుగు సంస్థలు, ప్రతినిధులను కలుపుతూ ఒకసమూహంగా ఏర్పాటుచేయాలని, ప్రతి జిల్లాలోనూ కలెక్టరేట్‌కు అను బంధంగా ఎన్నారైలకు సహకరించేందుకు ఒక విభాగాన్ని ఏర్పాటుచేసి, ప్రభుత్వం నుంచే అధికారులను నియమించే ఏర్పాట్లుచేస్తున్నామని తెలిపారు.ప్రవాసాంధ్రులు ప్రస్తావించిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఔత్సాహికుల నుంచి ప్రభుత్వం పెట్టుబడులు ఆహ్వానిస్తోందని, ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తే వారికి తమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకసెల్ ఏర్పాటు చేసి సహకరిస్తామని తెలిపారు.రాష్ట్రప్రభుత్వంతో కలిసి నడిచేందుకు, తమ కష్టనష్టాలను తెలిపేందుకు ఈవేదిక వారధిలా ఉపయోగపడుతుందని ప్రవాస తెలుగు ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రవాసాంధ్రులకు లభించేసౌకర్యాలు, కష్టసమయాల్లో అందించే సహాయాన్ని ఏపీఎన్ఆర్‌టీ అధికారులు పవర్ ప్రజెంటేషన్‌తో వివరించారు.ఐరోపా ఖండంలోని జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్, పోలాండ్, యూకే, స్విట్జర్లాండ్, హంగేరి, ఐర్లాండ్, ఆస్ట్రియా, ఫ్రాన్స్, బెల్జియం దేశాల్లోని తెలుగు ప్రతినిధులు సమస్యలను, సూచ నలను మంత్రి శ్రీనివాస్‌తో పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు టిట్టు మద్దిపట్ల, శ్రీకాంత్ కుడితిపూడి , సుమంత్ కొత్రపాటి, నరేష్ కోనేరు, జయకుమార్ గుంటుపల్లి, శివ బాతల, వివేక్ కరియావుల, సునంద బొప్పన, పవన్ కుర్రా, ఏపీఎన్ఆర్‌టీ సీఈవో పి.హేమలతా రాణి, డిప్యూటీ డైరెక్టర్ కరీమ్, అసిస్టెంట్ డైరెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

సాగు నీటి ప్రాజెక్టు కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

జిల్లాలోని ఆంధ్ర, మడ్డువలస, తాటిపూడి ప్రాజెక్టులు, పారాది, డెంకాడ ఆనకట్ట చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. ఈ మేరకు శనివారం నీటిపారుదలశాఖ, తహసీల్దార్ కార్యాలయాల్లో డైరెక్టర్లు ఎన్నుకున్నారు. ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లకు అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

- గజపతినగరం, డిసెంబరు 21:(ఆంధ్రజ్యోతి):ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్‌గా కోడి సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. గజపతినగరంలోని ఇరిగేషన్ కార్యాలయంలో తోటపల్లి ప్రాజెక్టు ఎస్ఈ తిరుపతిరావు అధ్యక్షతన ఎన్నికజరిగింది. ఈసందర్భంగా ఆరుగురు డైరెక్టర్లు చైర్మన్‌గా కోడిసతీష్, వైస్ చైర్మన్‌గా పడాల గంగునాయుడులు ఎన్నికయ్యారు.
- రాజాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస ప్రాజెక్టు చైర్మన్‌గా సంతకవిటి మండలంలోని మామిడిపల్లికి చెందిన పున్నాన రామినాయుడు ఎన్నికయ్యారు. రాజాం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించిన ఎన్నికల్లో ప్రాజెక్ట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలంలోని సంతవురిటికి చెందిన బాలబొమ్మ వెంకటేశ్వర్లతో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ప్రాజెక్ట్ కార్యవర్గానికి రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అభినందించారు.
- గంట్యాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ ఆయకట్టు చైర్మన్‌గా కొళ్ళంపూడి జగన్నాథం, ఉపాధ్యక్షుడిగా వేములాపల్లికి చెందిన లగుడు ఎర్నినాయుడు ఎన్నికయ్యారు. తాటిపూడి రిజర్వాయర్ వద్ద అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. పది మంది డబ్ల్యుఏపీ అధ్యక్షులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు.
- బొబ్బిలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది ఆనకట చైర్మన్‌గా బాడంగి మండలంలోని పాల్తేరుకు చెందిన టీడీపీ నాయకుడు పెంట సత్యనారాయణ, వైస్‌చైర్మన్‌గా బొబ్బిలి మండలంలోని పెంట మాజీ సర్పంచ్ బేతనపల్లి రమణమూర్తి ఎన్నికయ్యారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు.
- డెంకాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డెంకాడ ఆనకట్టు చైర్మన్‌గా సిరికి రమణ ఎన్నికయ్యారు. విజయనగరం నీటి పారుదల శాఖ కార్యాలయంలో జనసేన పార్టీ బలపరిచిన శిరికి రమణను డైరెక్టర్లు బలపరిచి, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలుగుదేశం పార్టీ బలపరిచిన రొంగళి సత్యాన్ని వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

పంట నష్టంపై నివేదిక ఇవ్వండి

- వర్షాలకు దెబ్బతిన్న పొలాల పరిశీలన


పూసపాటిరేగ: అల్లాడపాలెంలో వరిపంటను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వర్షాల వల్ల పంట నష్టాన్ని అధికారులు గుర్తించి వెంటనే ఉన్నతాధికారులకు ఇవ్వాలని టీడీపీ నాయకులు కోరారు. పంటనష్టంపై తమ అధిష్టానం దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు. జిల్లాలో కొద్దిరోజులుగా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం పరిశీలించారు.

- భోగాపురం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోపి పోలిపల్లిలో పొలాల్లో ఉన్న కోసిన వరి పంట వర్షంనీటిలో ఉండడంతో మార్కెఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు పరిశీలించారు. ప్రస్తుతం తీసుకోవలిసిన జాగ్రత్తలను రైతులకు వివరించాలని ఏవో హరికృష్ణకు బంగార్రాజు కోరారు.
- పూసపాటిరేగ,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో అల్లాడపాలెం పరిధిలో నీటమునిగిన వరిపంటను టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఆకిరి ప్రసాదరావు, ఏవో కె.నీలిమ పరిశీలించారు. పేరాపురం, వెంపడాం, చౌడవాడ, పూసపాటిరేగ, గోవిందపురంలో వరితోపాటు కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. ప్రాథమికంగా 20ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు అంచనావేశారు.
- నెల్లిమర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):వర్షాల వల్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని శనివారం ఒక ప్రకటనలో కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివాసం ఉండవద్దని, తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.
- లక్కవరపుకోట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని చందులూరు, మార్లాపల్లి, ఎల్.కోట గ్రామాల్లో తడిసిన, మొలకలు వచ్చిన పంటను ఏవో ఎం.స్వాతి ఆధ్వర్యంలో పరిశీలించారు. పెసర, మినుము పంటల నష్టాన్ని అంచనావేశారు.

నిధులకోసం ప్రతిపాదనలు: ఎస్ఈ

గజపతినగరం, డిసెంబరు 21:(ఆంధ్రజ్యోతి) గజపతినగరం బ్రాంచ్ కెనాల్ పనులకు సంబందించి నిధులు మంజూరుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదించనున్నట్లు తోటపల్లి ప్రాజెక్టు ఎస్ఈ తిరుపతిరావు తెలిపారు. శనివారం గజపతినగరంలో విలేకరులతో మాట్లాడుతూ 2009లో గజపతినగరం బ్రాంచ్‌కెనాల్‌కు సంబందించి 90 కోట్లతో పనులు ప్రారంభించగా, ప్రస్తుతానికి 40 శాతం పనులు మాత్రమే జరిగియని చెప్పారు. పెరిగిన ,దరలతో పాటు భూసేకరణ చేపట్టాల్సి ఉండడంతో రూ. 165 కోట్ల ప్రతిపాదనలు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈరాంబాబు, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

రాజాంలో గణిత దినోత్సవం

రాజాం రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):రాజాంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో గణితశాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను వివరించారు.

డయేరియా బాధితులకు చెక్కుల పంపిణీ

చీపురుపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):గుర్ల మండలంలోని నాగల్లవలస డయేరియా బాధితులకు జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెక్కులు పంపిణీ చేశారు. శనివారం చీపురుపల్లిలో ఏర్పాటుచేసినకార్యక్రమంలో నాగల్లవలసకు చెందిన రెండు బాధిత కుటుంబాలకు రెండేసి లక్షలు చొప్పున అందజేశారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, సీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు, తోట తిరుపతిరావు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన 108 ఉద్యోగి

శృంగవరపుకోట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని వీరనారాయణం గ్రామానికి చెందిన 108 ఉద్యోగి ఎంఎస్ఎన్ మూర్తి కృష్ణ జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో సత్తాచాటాడు. ఈ మేరకు బంగారు పతకం సాధించాడు. జావిలిన్‌త్రో, హేమర్‌త్రోలో గోల్డ్ మోడల్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మోడల్ దక్కించుకున్నాడు. మూర్తిని పలువురు అభినందించారు.

పార్లమెంట్‌లో నవ్యాంధ్ర పుస్తకావిష్కరణ

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి): విజయనగరానికి చెందిన రచయిత, రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీత సముద్రాల గురుప్రసాద్ రాసిన పార్లమెంట్‌లో నవ్యాంధ్రపుస్తకాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు.కార్యక్రమంలో లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.బాబ్జీ పాల్గొన్నారు.

సైనిక స్కూల్ తల్లిదండ్రుల అసోసియేషన్ ఎన్నిక

విజయనగరం రూరల్, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుకొండ రోడ్డులో గల కోరుకొండ సైనిక స్కూల్ తల్లిదండ్రుల అసోసియేషన్ ఎన్నికలు శనివారం జరిగాయి.అధ్యక్షుడిగా పైలా గజేంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికైన గజేంద్రరావును స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ వీవీఎస్ శాస్త్రి అభినందించారు. కార్యక్రమంలో డి.సురేష్, కె.శ్రీనివాస్, శ్రీలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో చండీయాగం

కొత్తవలస, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రామలింగపురం, దేవాడ, ముసిరాం గ్రామాలకు సంబంధించిన తోటలో దుర్గమ్మ ఆలయంలో మహాచండీయాగాన్ని నిర్వహించారు.వేదపండితుడు అంపోలు ఉమామహేశ్వరశర్మఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజాము నిర్వహించిన కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

గజపతినగరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూడి రామ్మోహనరావు తెలిపారు.శనివారం గజపతినగరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా 32వ మహాసభలు నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్, వి.చిన్నబాబు, పి.రమేష్, మణికుమార్ పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కొత్తవలస, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని కులవివక్ష పోరాట సమితి సభ్యులు కోరారు. ఈమేరకు శనివారం ఉత్తరాపల్లి పంచాయతీ గాంధీనగర్ ఎస్సీ కాలనీలోగల అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు, కేవీపీఎస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వంక ఆదినారాయణ, పీవీ సూర్యనారాయణ, బండసూరిబాబు, గాడి సోని, పావాడ మణి పావాడ సునీత పాల్గొన్నారు.

వీడీసీఏ అధ్యక్షుడిగా ఎంపీ కలిశెట్టి



విజయనగరం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ (వీడీసీఏ)కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటుచేశారు. ఈ మేరకు అధ్యక్షుడిగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కార్యదర్శిగా పెనుమత్స సీతారామరాజు (రాంబాబు)లు నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా కలిదిండి వెంకటపతిరాజు, సంయుక్త కార్యదర్శిగా దంతులూరి సీతారామరాజు, ట్రెజరర్‌గా ముదునూరు సూర్యనారాయణ వర్మ, అపెక్స్ కమిటీ సభ్యులుగా పిన్నింటి సంతోష్‌కుమార్, ప్లేయర్ సభ్యులుగా కొండపల్లి పైడితల్లి నాయుడు, మహిళా ప్లేయర్ సభ్యులుగా పాకలపాటి విజయలక్ష్మి నియమితులయ్యారు.

సమస్యలపై మండల సమావేశంలో చర్చ

సంతకవిటి, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన జరిగినమండల సర్వసభ్య సమావేశంలో పలుఅంశాలపై చర్చ జరిగింది. సాగునీటి సమస్యలు పరిష్కరించే విధంగా, అధికారులు చొరవ తీసుకోవాలని సభ దృష్టికి పలువురు సభ్యులు తీసుకొచ్చారు. జలజీవన్‌మిషన్ ద్వారా అన్ని పంచాయతీలకు తాగునీరు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సురేష్, వైస్ ఎంపీపీ పాపారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు, మండల అధికారులు పాల్గొన్నారు.

గంజాయిపై పకడ్బందీ నిఘా: ఎస్పీ

విజయనగరం క్రైం, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాపై పకడ్బందీ నిఘా పెట్టామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడకుండా విస్తృతంగా తనిఖీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గంజాయి నియంత్రణకు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే మార్గాల్లో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫలితంగా అక్రమ రవాణాని నియంత్రించగలిగామన్నారు. ఇప్పటివరకూ గంజాయి అక్రమ రవాణాకి పాల్పడుతున్నవారిపై 81 కేసులు నమోదు చేసి 247 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 2,152.139 కిలోల గంజాయి, 78 గ్రాముల నల్లమందు, 29 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ రూ.కోటీ 2 లక్షల 30 వేల 415 వుంటుందని గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడితే, ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

శివారు భూములకూ సాగునీరందాలి

● మంత్రి సంధ్యారాణి



నీటి సంఘాల ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు భూమికి నీరు అందించేలా సాగునీటి సంఘాలు పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం సాలూరులోని తన నివాసంలో నీటి సంఘాలు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌లలో ఏకగ్రీవంగా విజయం సాధించిన రైతులతో, నీటి సంఘాలతో ఆమె సమావేశమయ్యారు. నియోజకవర్గంలో పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్, ఆంద్ర జలాశయాలకు సంబంధించి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా కూటమి ప్రభుత్వానికి చెందిన వ్యక్తులే ఎన్నిక కావటం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వారికి అభినందనలు తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆయన రాకతో మరో రూ.54 కోట్లు అదనంగా నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల నూతన కార్యవర్గం

మక్కువ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు ఛైర్మన్‌గా తూరుమామిడి గ్రామానికి చెందిన మత్స గోదావరి, వైస్ ఛైర్మన్‌గా కవిరిపల్లి గ్రామానికి చెందిన పెంట సత్యం ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ● జియ్యమ్మవలస: వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా మూడడ్ల సత్యంనాయుడు, వైస్ ఛైర్మన్‌గా ముంజేటి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, అరకు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, నీటి పారుదలశాఖ ఏఈ జీవీ రఘు, తదితరులు పాల్గొన్నారు. ● వీరఘట్టం: సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. చైర్మన్‌గా పొదిలాపు విజయరమణి, వైస్ చైర్మన్‌గా ఆలుబిల్లి పార్థసారధిని ఎన్నుకున్నారు. ● పాచిపెంట: పెద్దగెడ్డ ప్రాజెక్టు కమిటీ చైర్‌పర్సన్‌గా గుంప్రోతు పార్వతి, వైస్ చైర్మన్‌గా యాసర్ల అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

మంత్రి దృష్టికి సమస్యలు



రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘ సభ్యులు

పార్వతీపురం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్య లు పరిష్కరించా లని రాష్ట్ర రవాణా శాఖమం త్రి ఎం.రాంప్రసాద్ రెడ్డికి పార్వతీపురం మన్యం జిల్లా డిపో ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘాలు వినతపత్రాన్ని అందజేసాయి. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో కొత్తబస్సుల ప్రారంభో త్సవానికి విచ్చేసిన ఆయనకు సంఘాల నాయకులు ఉద్యోగుల సమస్యలను విన్నవించారు. ఈయూ నాయకుడు ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ సంఘ సభ్యులు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్క రించాలని కోరారు. అలాగే ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తాతాబాబు ఆధ్వర్యంలో పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించాలని కోరారు.

పాలకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విచ్చేశారు. ఈ మేరకు ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ విజయనగరం జోన్ జోనల్ సెక్రటరీ బాసూరు కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు మరిపి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, పార్వతీపురం డిపో కార్యదర్శి కత్రి నరసింగరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డిపో అధ్యక్షులు టి.వి.నాయుడు, సాలూరు డిపో కార్యదర్శి ఎం.ఎస్.నారాయణ, డిపోవర్కింగ్ ప్రెసిడెంట్ జె.కిరణ్‌కుమార్, పాలకొండ డిపో నాయకులు ఆచారి ఉన్నారు.

● బెలగాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన రవాణా, క్రీడా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి స్థానిక డీటీవో కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం అధికారులతో సమీక్షించారు.

ప్రశాంతంగా పీసా ఎన్నికలు

సీతంపేట రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పీసా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం 23 గ్రామసభలు నిర్వహించగా వీటిలో దిగువ చాపరాయిగూడ, దొండమామిడిగూడ, బుడగరాయి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో మాత్రమే ఎన్నికలు జరిగాయని, మిగిలిన 20 ఏక గ్రీవమైనట్లు చెప్పారు. రానున్న రోజుల్లో నిర్వహించే పీసా ఎన్నికలు కూడ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

● పెద్దగూడ గ్రామంలో నిర్వహించిన పీసా ఎన్నిక ఏకగ్రీవమైంది. పీసా ఎన్నికల అధికారి పి.నారాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో అధ్యక్ష, కార్యదర్శులను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన అభ్యర్థులకు ఎన్నికల అధికారి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ ఎన్నికల ప్రక్రియలో ఎంపీటీసీ బాపన్న, సీనియర్ అసిస్టెంట్ ఎల్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధం కావాలి

పాలకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజలంతా ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, కమిటీ కార్యవర్గ సభ్యులు దావాల రమణరావు పిలుపునిచ్చారు. సీపీఎం మండల జనరల్ బాడీ సమావేశం శనివారం స్థానిక నవోదయనగర్‌లో నిర్వహించారు. అదానీ ఒప్పందాన్ని అమలు చేస్తున్న చంద్రబాబు స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మిస్తారన్నది హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఎ.లక్ష్మణరావు, ఎ.భానుచందర్, కాద రాము, దూసి దుర్గారావు బి.వాణి ప్రభ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

● ఘనంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం



నెల్లిమర్ల: ధ్యానం చేస్తున్న ఛాత్రోపాధ్యాయులు, యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు



పాలకొండ: ధ్యానం చేస్తున్న సాధకులు



బెలగాం: విద్యార్థుల విన్యాసం

నెల్లిమర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు వక్తలు తెలిపారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. వేణుగోపాలపురంలోని ప్రభుత్వ డైట్‌లో ధ్యాన, జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పగడాలమ్మ, వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

● గరివిడి: స్థానిక అవంతీస్ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా.జాషువా జయప్రసాద్ అధ్యక్షతన ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ హేమలత ధ్యానంపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనీల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● పాలకొండ : స్థానిక రుషి యోగా కేంద్రంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జనార్థన్ గురూజీ, యోగా కేంద్రం సభ్యులు, సాధకులు పాల్గొన్నారు. ● శృంగవరపుకోట: ఎస్.కోటలో సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ, డైరెక్టర్ వై.విజయలక్ష్మి పద్మాసనం, వజ్రాసనం ప్రదర్శించారు. ఎస్.కోటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ కేశవరావు ధ్యానంపై అవగాహన కల్పించారు. వ్యాయమ ఉపాధ్యాయుడు రెడ్డి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ● బెలగాం: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంచుపల్లి శ్రీరాములు అన్నారు. శనివారం స్థానిక ఎన్జీహోంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. బ్రహ్మకుమారి ఓం శాంతి నిర్వహకరాలు గ్యానరత్నం, యోగా గురువు జామి భాస్కర్, జయబాబు, ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.● బొబ్బిలి రూరల్: ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బ్రహ్మకుమారీస్ అక్కయ్య బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఎంపీపీ శంబంగి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయాధికారి వివేకానంద శ్రీనివాస్

పాలకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సబ్ జైలులో ఉన్న రిమాండ్ ఖైదీల ఆరోగ్య పరిరక్షణపై జైలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా అదనపు న్యాయాధికారి సీహెచ్ వివేకానంద శ్రీనివాస్ అన్నారు. పాలకొండ సబ్‌జైలును శ్రీకాకుళం సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, పాలకొండ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఏ.విజయ్‌రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. జైలు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి, మాట్లాడారు. జైల్లో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఎటువంటి సమస్యలు ఉన్నా జైలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలు ఇన్‌చార్జి పి.చంద్రరావు, న్యాయవాది బొడ్డు రామ్మోహన్‌రావు, న్యాయవాదులు ఆర్.కుమారస్వామి, ఎన్.సింహాచలం, జైలు హెడ్ వార్డర్లు బి.విజయ్‌కుమార్, హేమసుందర్, పోలీస్ సెక్యూరిటీ ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, హెచ్‌సీ డీపీటీ నాయుడు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి

జియ్యమ్మవలస, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని ఆర్ఆర్‌బీ పురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీకటి శంకరరావు అన్నారు. అలమండ పంచాయతీ చినతోలుమండగూడ గ్రామంలో శనివారం ఆయన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రత్యేక ప్రణాళికలు

పార్వతీపురంటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని విద్యుత్ శాఖ సీఎండీ ఇ.పృథ్వీతేజ్ తెలిపారు. మన్యం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన శనివారం పరిశీలించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా వినియోగదారులు తెలియజేయాలన్నారు. విద్యుత్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలోని విద్యుత్ సబ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చలపతిరావు, ఈఈ గోపాలనాయుడు పాల్గొన్నారు.

600 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో 600 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని ఎల్విన్‌పేట, రెల్ల, తాడికొండ, కేదారిపురం, కుక్కిడి, గొయ్యిపాక, పి.ఆమిటి కేంద్రం ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. మండలంలో ఈ ఏడాది 640 ఎకరాల్లో ధాన్యాన్ని పండించినట్లు తెలిపారు.

పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలి

సాలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ పూర్తి స్థాయిలో అభివృద్ధి కావాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. తన నివాసంలో శనివారం పశు సంవర్థక శాఖ అధికారుల ఆధ్వర్యంలో తొమ్మిది మంది రైతులకు ట్రైకార్ రుణాలు అం దజేశారు. పాడి పరిశ్రమ పూర్తి స్థాయిలో అభివృద్ధి కావాలన్నారు.

పశు గణన సక్రమంగా నిర్వహించాలి

ప్రభుత్వం నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన పటిష్టవంతంగా నిర్వహించాలని జిల్లా పశు సంరక్షణ అధికారి డా.ఎస్.మన్మథరావు కోరారు. పట్టణంలోని పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశుగణన సర్వేను ఆయ న శనివారం పరిశీలించారు. పశుగణనలో ఎలాంటి తప్పులు లేకుండా పటిష్టవంతంగా నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా టంకాల

పాలకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ డైరెక్టర్‌గా టంకాల దుర్గారావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పాలకొండ పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడిగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా మాజీ అధ్యక్షుడిగా గతంలో పనిచేశారు. అలాగే రైల్వే బోర్డు సభ్యులుగా కూడా పనిచేశారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా దుర్గారావును నియమించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి, సీనియర్ నాయకులు కుప్పనగారి కుమారరాజాలతోపాటు కూటమి నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రామభద్రపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణ రావు కోరారు. తారాపురం గ్రామంలో శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఎస్ఐ వెలమల ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శిరస్త్రాణం.. శ్రేయస్కరం

(ఐదో పేజీ తరువాయి)

ఎంపిక చేసుకోవాలి. తలకు ధరించినప్పుడు స్ట్రాప్ తీసుకునేందుకు, పెట్టుకునేందుకు వీలుగా ఉండాలి. ప్రధానంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఐఎస్‌ఐ అనుమతులు పొందిన కంపెనీల శిరస్త్రాణం ధరించాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు. హెల్మెట్ వాడటం వల్ల ప్రమాదాలు జరిగినా తలకు అయ్యే గాయాల తీవ్రతను తగ్గిస్తుంది. ప్రమాదంలో ప్రాణాపాయ స్థితి నుంచి 98 శాతం బయటపడొచ్చు. దుమ్ము, ధూళి, ఎండ నుంచి హెల్మెట్ వాడకంతో రక్షణ పొందొచ్చు.

ధరించకపోతే ఉపేక్షించం

హెల్మెట్ నిబంధన పక్కాగా అమలు చేస్తున్నాం. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి. లేకుంటే కేసులు నమోదు చేస్తాం. మొదటిసారి పట్టుబడితే అవగాహన కల్పిస్తాం. మళ్లీ పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తాం.

\- ఎస్వీ మాధవరెడ్డి, ఎస్పీ, పార్వతీపురం మన్యం

నిబంధనలు పాటించాలి

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనదారుల వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయడం లేదు. వాహనదారులంతా విధిగా మోటారు నిబంధనలు పాటించాలి. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే మోటార్ యాక్ట్ చట్టం కింద జరిమానా విధించడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తాం.

\- ఎం.శశికుమార్, ఇన్‌చార్జి జిల్లా రవాణా అధికారి

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ ఎస్.శాంతకుమారి పాల్గొన్నారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజాప్రతినిధులు తమ పంచాయితీలలో సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కమ్మవలస సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో కార్యక్రమాలకు అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని తెలిపారు. సీహెచ్ బొడ్డవలస సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అంగనవాడీ కేంద్రంలో ఆశా కార్యకర్తలను నియమించాలని కోరారు. అలాగే ఎస్సీ కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఈవో తిరుపతినాయుడు

పార్వతీపురం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో దివ్యాంగ పిల్లలపై దృష్టి సారించాలని డీఈవో ఎన్.తిరుపతినాయుడు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లాలోని ఎంఈవోలకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఈవో తోపాటు వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్టేట్ అబ్జర్వర్ అమ్మినాయుడు, జిల్లా కో-ఆర్డినేటర్ భాను మూర్తి, జిల్లా రిసోర్స్‌పర్సన్‌గా రాయిడి శంకరరావు హాజరయ్యారు. దివ్యాంగ పిల్లలకు పాఠశాల్లో ఉన్న విద్యా సౌకర్యాలు, పబ్లిక్ పరీక్షల్లో రాయితీలు, మినహాయింపులపై తెలియజేశారు. ప్రశస్త యాప్‌పై వివరించారు. డీఈవో మాట్లాడుతూ ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ జిల్లాలో ఇంకా బాగా జరగాలన్నారు. ఎంఈవోలు, డీఈఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్‌పై బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా ఇటీవల మాట్లాడిన మాటలు అంబేడ్కర్ వ్యక్తిత్వాన్ని, అస్థిత్వాన్ని దిగజార్చేలా ఉన్నాయని కురుపాం కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. మంత్రిగా ఉన్నతమైన స్థానంలో ఉంటూ అమిత్‌షా స్పృహ లేకుండా మాట్లాడడం తగదన్నారు.

సరైన పౌష్టికాహారం అందించాలి



గర్భిణితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

సీతంపేట రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో వైటీసీలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహాన్ని జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతీ శనివారం పరిశీలించారు. వసతిగృహంలో గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. వసతిగృహంలో ఉన్న గర్భిణుల ఈడీడీ(ఎక్స్‌పెక్ట్ డేటు ఆఫ్ డెలవరీ) వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సరైన పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

న్యూస్ బాక్స్

రైలు కింద పడి మేకల మృతి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి పది మేకలు మృతి చెందిన ఘటన బొబ్బిలి పట్టణ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దిబ్బగుడ్డివలస గ్రామం యాదవ కులానికి చెందిన కె.గంగులు మేకలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే శనివారం కూడా మేకలను మేత కోసం తీసుకెళ్లాడు. సాయం త్రం తిరిగి తోలుకుని రైలు పట్టాల వైపు వస్తున్నాడు. అదే సమయంలో అటుగా వస్తున్న గుర్తు తెలియని రైలు శబ్దానికి మేకలు భయపడి రైలు పట్టాలపైకి పరుగులు తీశాయి. దీంతో రైలు ఢీకొని పది మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో గంగులు లబోదిబోమన్నాడు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

బొబ్బిలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కేక్ కట్ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ● సాలూరు: ప్రజల మనిషి జగన్మోహన్‌రెడ్డి అని మాజీ ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర అన్నారు. శనివారం సాలూరులోని తన నివాసంలో జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయన తోపాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోముఖికి వరద ఉధృతి

మక్కువ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావం కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని శంబర గ్రామ సమీపంలో ఉన్న గోముఖి రిజర్వాయర్‌కు వరదనీరు వచ్చి చేరుతుండడంతో నదుల్లోకి 200 క్యూసెక్కుల నీటిని శనివారం విడిచిపెట్టారు. నదీ పరివాహక ప్రాంతాల గ్రామ ప్రజలను అప్రమత్తం చేశామని, వరద ఉధృతి పెరిగితే కొన్ని క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టే అవకాశం ఉందని ఇరిగేషన్ జేఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

ధ్యానం దివ్య ఔషధం

ఒడిశా

రాయగడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మనిషి ఆరోగ్యానికి ధ్యానం దివ్య ఔషధమని ప్రముఖ యోగా గురువు దినేష్‌టాంక్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సాయిప్రియనగర్ సిటీ కళాశాల ప్రాంగణంలో సాయిప్రియ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రముఖ నేత్ర వైద్యుడు సురేష్ కుమార్ అధ్యక్షతన ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా డాక్టర్ జి.వెంకటరమణ, కింతలి నాగేశ్వరరావు హాజరయ్యారు. క్లబ్ సభ్యులు, కార్యదర్శి కె.సూర్యనారాయణ శర్మ, కోశాధికారి టీఎన్ రావు, సలహాదారులు లాడి చంద్రమౌళి, దేవరాజ్ పండా తదితరులు పాల్గొన్నారు.